బంద్ ప్రశాంతం


గాంధారిలో మూసి ఉన్న దుకాణాలు


మద్నూర్‌లో ..


బాన్సువాడలో ..


మద్నూర్‌లో నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హిందువులు

హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో బాన్సువాడ, మద్నూర్, గాంధారి, బిచ్కుందలలో తలపెట్టిన బంద్ మంగళవారం ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని వర్గాల ప్రజలు బంద్‌ను పాటించారు. స్వచ్ఛందంగా దుకాణాలను మూసి ఉంచారు. హిందూ సంఘాల నేతలు మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ..హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడులు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్

బీజేపీ నేతల ఆందోళన


సదాశివనగర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): హిందు దేవాలయాలపై దాడులను నిరసిస్తూ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం


బోర్లంలో పొలంబాటలో విద్యుత్ అధికారులు


మల్లుపేట్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బాన్సువాడ రూరల్: రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో డీఈ ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన ఏడీఈ శ్రీనివాస్, ఏఈ అనిల్‌కుమార్‌లతో కలిసి బోర్లం గ్రామంలో పొలంబాట కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. రైతులు ఏదైనా సమస్య ఉంటే సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు చేసుకోకుండా లైన్‌మన్‌కు గాని, ఏఈకి గాని తెలియజేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మల్లుపేట్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు రైతుల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

డీఏ చెల్లించి పీఆర్‌సీ అమలు చేయాలి


బాన్సువాడలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు


భవానిపేటలో..


మద్నూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: పెండింగ్ డీఏలు చెల్లించి పీఆర్‌సీ అమలు చేయాలని కోరుతూ బాన్సువాడ, మద్నూర్, లింగంపేటలలో మంగళవారం ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. తపస్ ఆధ్వర్యంలో నల్లబాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తపస్ నాయకులు మాట్లాడుతూ.. తపస్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేసినట్లు వివరించారు. ఈ నెల 28న తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించడం, వచ్చే నెల 5న కలెక్టరేట్ల ఎదుట ధర్నా, నవంబర్ 23న ధర్మాగ్రహ దీక్ష పేరుతో హైదరాబాద్‌లో దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎల్‌వోసీ అందజేత



కామారెడ్డి రూరల్: గర్గుల్ గ్రామానికి చెందిన రమేష్ కుమారుడు తనీష్‌కు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ రూ.2 లక్షల 50 వేల ఎల్‌వోసీ అందజేశారు. రమేష్ కుమారుడు తనీష్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో షబ్బీర్‌అలీని సంప్రదించగా వెంటనే స్పందించిన ఆయన ఎల్‌వోసీని మంజూరు చేయించారు. షబ్బీర్‌అలీకి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

బీమా చెక్కు..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో సఫాయి కార్మికుడిగా విధులను నిర్వర్తిస్తూ మృతి చెందిన దుర్గయ్య కుటుంబానికి బీమా చెక్కును మున్సిపల్ చైర్మన్ పద్మశ్రీకాంత్ అందించారు. బజాజ్ ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు..

రాజంపేట: అన్నారం తండాకు చెందిన అనూషకు సీఎం సహాయ నిధి మంజూరు కావడంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావ్ ఆదేశాల మేరకు మంగళవారం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్ రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సుభాష్ నాయక్, గ్రామ అధ్యక్షుడు కిషన్, తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్

కల్యాణలక్ష్మి చెక్కులు..

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని లక్ష్మాపూర్, జాన్కంపల్లి ఖుర్దు గ్రామాలలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కుర్మ సాయిబాబా అందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ ఉషాగౌడ్, కాంగ్రెస్ నాయకులు పద్మారావు, సంజీవరెడ్డి, మామిడి రవీందర్ తదితరులున్నారు.

సమాచారం..

నేడు మహమ్మద్‌నగర్, ఎల్లారెడ్డి బంద్

ఎల్లారెడ్డి/నిజాంసాగర్(జుక్కల్): దేవాలయాలపై దాడులకు నిరసనగా బుధవారం మహమ్మద్‌నగర్, ఎల్లారెడ్డి మండల కేంద్రాల్లో బంద్‌కు పిలుపునిచ్చినట్లు హిందూ ధర్మ రక్షణ సమితి సభ్యులు, హిందూ సంఘం నాయకులు వేర్వేరుగా తెలిపారు. వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు సహకరించాలని కోరారు.

ఎర్రాపహాడ్‌లో సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌లో ఈ నెల 23న ప్రభుత్వ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తాడ్వాయి సింగిల్ విండో చైర్మన్ కపిల్‌రెడ్డి తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకువాలని కోరారు.

నేడు బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో నేడు బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు వీరప్ప అన్నారు. మంగళవారం నీలకంఠేశ్వరాలయంలో వారు మాట్లాడుతూ.. బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పీఠాధిపతులు సోమలింగ శివాచార్య, మల్లికార్జున్, సిద్ధ దయాల్‌తో పాటు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్ మోహన్‌లు సైతం రానున్నట్లు వారు తెలిపారు. నేతలు బసప్ప, రామప్ప, హనుమంతప్ప, సంగమేశ్వరప్ప, శ్రీరామ్ తదితరులున్నారు.

ఇస్కాన్‌లో 24న గౌరనితాయ్ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: అంతర్జాయతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) కామారెడ్డి సెంటర్‌లో ఈనెల 24న సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు శ్రీగౌరనితాయ్ చతుర్థ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి వెంకటదాస్ ప్రభు తెలిపారు. భజన కీర్తన, అభిషేకం, ప్రవచనం, తదితర కార్యక్రమాలుంటాయని ఆయన పేర్కొన్నారు.

మాలల ఆత్మగౌరవసభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడ రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 27న నాగర్ కర్నూల్‌లో జరుగనున్న మాలల ఆత్మగౌరవసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం తాడ్కోల్‌లో మాలమహానాడు నాయకులు ఆవిష్కరించారు. మాల పొలిటికల్ జేఏసీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్, సందుల గంగారం, బంగారు మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న నోడల్ అధికారి షేక్ సలాం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్య నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. మంగళవారం ఆయన కలెక్టర్ ఆదేశాల మేరకు లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసి తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు ప్రతీ రోజు కళాశాలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు శివ, దుర్గయ్య, రాజయ్య, స్వామిగౌడ్, అంజయ్య, అంజమ్మ, నాగు, శ్రీలత పాల్గొన్నారు.

ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాలి

బాన్సువాడ: పిల్లల పట్ల తల్లిదండ్రులు అశ్రద్ధ చేయవద్దని బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పిల్లలను ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాలని, ప్రతీ రోజు ఉదయం పిల్లలకు పనులు చెప్పకుండా చదివించాలని సూచించారు. ప్రతీ రోజు కళాశాలకు వెళ్లేలా తల్లిదండ్రులు చూడాలని, విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవడానికి కళాశాలకు వచ్చి అధ్యాపకులతో చర్చించాలని అన్నారు.

24న బాన్సువాడ కళాశాలలో సమావేశం

ఈ నెల 24న బాన్సువాడ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ అసద్ ఫారుక్ తెలిపారు.

ఉచిత కృత్రిమ కాలు, ట్రై సైకిళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామంలో మంగళవారం ఉచిత ట్రై సైకిళ్లు, కృత్రిమ కాలు కోసం ఎంపిక నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఐ పట్లోళ్ల మోహన్ రెడ్డి ఆర్థిక సహాయంతో, రోటరీ క్లబ్ (ఖమ్మం) సహకారంతో దివ్యాంగులకు సహాయం అందించడానికి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది దివ్యాంగులు కొలతలు ఇచ్చారు. అందరికి ఒక నెలలోపు అందిస్తామని పట్లోళ్ల మోహన్ రెడ్డి చెప్పారు. సాయిబాబా ట్రస్ట్ మెంబర్ విజయ్ కుమార్ రెడ్డి, రవి, నందు రెడ్డి, సత్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



బీబీపేట: బీబీపేట నుంచి కామారెడ్డి వెళ్లేందుకు విద్యార్థులతో పాటు ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు ఉదయం, సాయంత్రం వేళల్లో నడపాలని కోరుతూ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుతారి రమేశ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో డీఎం ఇందిరకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. బీబీపేట నుంచి ఉదయం 7 గంటల నుంచి 8 గంటలకు, అలాగే సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు కామారెడ్డి నుంచి బీబీపేటకు ప్రత్యేక బస్సులను నడపాలని కోరారు. అంతే కాకుండా కొమురవెల్లి వెళ్లే బస్సు బీబీపేట, తుజాల్‌పూర్, నస్కల్, రాంపూర్, భూంపల్లి మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సలీం ఉన్నారు.

పల్లె దవాఖానా తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్: భిక్కనూర్ గ్రామంలోని పల్లె దవాఖానాను ఆర్డీవో మన్నె ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. దవాఖానాలోని రికార్డులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సక్రమంగా వైద్యం అందించాలని సూచించారు. ఎంపీవో ప్రకాష్, వైద్య సిబ్బంది, తదితరులన్నారు.

'డబుల్' పనులు త్వరితగతిన పూర్తి చేయండి

ఎల్లారెడ్డి: డబుల్‌బెడ్ రూం పనులను వేగవంతం చేయాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో డబుల్‌బెడ్‌రూంల వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. తహసీల్దార్ మహేందర్ కుమార్, ఎంపీవో ప్రకాష్ తదితరులున్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

పద్మశాలి సంఘం సభ్యులు రాజకీయంగా ఎదగాలి



ఎల్లారెడ్డి: పద్మశాలి సంఘం సభ్యులు రాజకీయంగా మరిన్ని పదవులు సాధించాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నర్సయ్య అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌కు సన్మానం చేశారు. బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, పద్మశాలి సంఘం నాయకులు దశరథం, పండరి, శేర్ల వెంకటేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి 12వ వార్డులో అగస్త్య సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కమ్యూనిటీ మొబిలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు, విద్యార్థులకు మూఢనమ్మకాల మీద సైన్స్ పరికరాల ద్వారా అవగాహన కల్పించారు. దేవునిపల్లి పాఠశాల హెడ్మాస్టర్ గంగా కిషన్, ఉపాధ్యాయులు జంగం శ్రీశైలం, సునీల్, అగస్త్య ఫౌండేషన్ సిబ్బంది మల్లిక, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం మండల ప్రత్యేకాధికారి బావయ్య పర్యటించినట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. మాధవపల్లి శివారులో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం పోతంగల్ గ్రామాన్ని సందర్శించి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారని, హరిజనవాడ అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

పంచాయతీ అవార్డు కోసం షార్ట్ ఫిలిం చిత్రీకరణ



నస్రుల్లాబాద్(బాన్సువాడ): అంకోల్ క్యాంపులో మంగళవారం షార్ట్ ఫిలిం చిత్రీకరించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో నాగరాజు గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామ ఉర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ పురస్కార్ అవార్డు కోసం షార్ట్ ఫిలిం చిత్రీకరించామని తెలిపారు. జాతీయ పంచాయతీ అవార్డు- 2024కు గ్రామాన్ని ఎంపిక చేసి గ్రామంలో జరిగిన అభివృద్ధి నివేదికను పంపిస్తున్నామన్నారు. ఎంపీడీవో సూర్యకాంత్, మాజీ సర్పంచ్ రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తపస్ మండల కార్యవర్గం ఎన్నిక

మద్నూర్: తపస్ మద్నూర్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పండరీనాథ్, ప్రధాన కార్యదర్శిగా అజిత్‌కుమార్, సహ అధ్యక్షుడిగా రాజేందర్, ఉపాధ్యక్షుడిగా శంకర్, సహ ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా సత్యం, మహిళ కార్యదర్శిగా కల్పన, సభ్యులుగా సునీల్, జిల్లా కార్యదర్శిగా సంజయ్, డివిజన్ కార్యదర్శిగా మలహరి ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి శివకాంత్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మల్లేశం, ఉపాధ్యాయులు ఉన్నారు.

లింగంపేట పశువైద్యాధికారిగా హన్నా జోనస్



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల పశువైద్యాధికారిగా హన్నా జోనస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. లింగంపేటలో పనిచేసిన పశువైద్యాధికారి రవి కుమార్ నాగిరెడ్డిపేటకు బదిలీపై వెళ్లారు. ఆయన వెళ్లిన మూడు నెలలకు డాక్టర్ హన్నా జోనస్ నూతనంగా బాధ్యలు చేపట్టారు. వైద్యులు రవికుమార్, రమేశ్, రవి, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఆత్మకూర్ పశువైద్యాధికారిగా దివ్యశ్రీ



నాగిరెడ్డిపేట: ఆత్మకూర్ పశువైద్యాధికారిగా దివ్యశ్రీ బాధ్యతలు స్వీకరించారు.గ్రామంలోని పశువైద్య శాలలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఈమేరకు వెటర్నరీ అసిస్టెంట్‌గా దివ్యశ్రీ విధులలో చేరారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా చంద్రశేఖర్



కామారెడ్డి టౌన్: సీపీఎం నూతన జిల్లా కార్యదర్శిగా కందూరి చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా మహాసభలో పార్టీ జిల్లా కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. మంగళవారం నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా వెంకట్‌గౌడ్, మోతీరాం, కొత్త నర్సింలు, ముదాం అరుణ్, రేణుక, ఖలీల్, అజయ్‌లను ఎన్నుకున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు.

అందుబాటులో ఉండాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో అధికారులు అందుబాటులో ఉండి ఏయే సమస్యలున్నాయో తెలుసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలలో తిరుగుతూ పెండింగ్ ఇంటి పన్నులు వసూల్ చేయాలని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, సూపరింటెండెంట్ హన్మాండ్లు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడి భవనం ప్రారంభం



నాగిరెడ్డిపేట: మెల్లకుంటతండా జీపీ పరిధిలోని మహాదేవునిగడ్డ తండాలో మంగళవారం అంగన్‌వాడి స్కూల్ భవనాన్ని తండావాసులు ప్రారంభించారు. తండాలో ఇటీవల అంగన్‌వాడి భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో భవనాన్ని ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ దేవిసింగ్, నాయకులు వసూరాం, గోవింద్ తదితరులున్నారు.

నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని టేక్రియాల్ గ్రామ ఎక్స్ రోడ్ వద్ద మంగళవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ వెహికల్ చెకింగ్‌లో నంబర్ ప్లేట్లు సరిగా లేని 8 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా 10 మందికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

25వ సారి రక్తదానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం ఉపాధ్యక్షుడు, పోలీసుశాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్న పుట్ల అనిల్‌కుమార్ మంగళవారం 25వ సారి రక్తదానం చేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా అనిల్ కుమార్ రక్తదానం చేయడం పట్ల రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయ కర్త బాలు, చైర్మన్ ఎం.రాజన్న, సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్‌లు అభినందించారు.

సంక్షిప్తం

అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం తాడ్వాయి మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కొత్తపల్లిపోషయ్య, చాకలిరాజయ్య, పోతరాజు సాయిలు, అధ్యక్షుడిగా బక్కగణేష్, ప్రధాన కార్యదర్శిగా గైనిలింగం, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యసలహాదారులుగా సతీస్, లింగం, రవికుమార్, కొత్తపల్లిగంగారాం, గైని రాజులను ఎన్నుకున్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

బాన్సువాడ: ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీర్కూర్ కామప్ప చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ మాట్లాడుతూ.. రైతు భరోసా నిధులను శాశ్వతంగా ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. నాయకులు మోచి గణేష్, రమేష్‌యాదవ్, గణేష్, దత్తు, సుధాకర్ తదితరులున్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

నిజాంసాగర్(జుక్కల్): పరిసరాల పరిశుభ్రతతో పాటు సంపూర్ణ పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం జుక్కల్ మండలం గుండూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు.

కార్మికుల తరఫున బీఎల్‌టీయూ పోరాటం

దోమకొండ: బీడీ కార్మికుల తరఫున బీఎల్‌టీయూ నిరంతరం పోరాడుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దరాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని దేశాయ్ బీడీ కంపెనీలో పలువురు టేకేదార్లు బీఎల్‌టీయూలో చేరగా ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు నాగారపు ఎల్లయ్య, రాంచంద్రం, అంజనేయులు, లక్ష్మీనారాయణ, గంగాధర్, సాయిలు, తదితరులున్నారు.

బెల్ట్‌షాపు తొలగించాలని వినతి

దోమకొండ: అంబారిపేటలో బెల్ట్‌షాపులను తొలగించాలని గ్రామానికి చెందిన పలువురు మంగళవారం ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహించడం వల్ల యువత మద్యానికి బానిసై కుటుంబాలు దెబ్బతింటున్నాయన్నారు. స్వామి, శంకర్, శ్రీనివాస్, నర్సింలు, గ్రామస్తులు ఉన్నారు.

బడి మానేసిన విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన సీఆర్పీలు

లింగంపేట(ఎల్లారెడ్డి): బాణాపూర్ తండాలో బడిమానేసిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించినట్లు సీఆర్పీ సంజీవులు తెలిపారు. మంగళవారం తండాలో ఇంటింటికి తిరిగి వారిని గుర్తించినట్లు తెలిపారు.

బోరు బావి తవ్వకం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, అంగన్‌వాడి కేంద్రాలలో నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానిక నాయకులు మంగళవారం బోరు వేయించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్ మాట్లాడారు. ప్రతి సమస్యను సొంత సమస్యగా భావించి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిష్కరిస్తారన్నారు. నేతలు మైశాగౌడ్, తిరుపతి, వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.